సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 23 । జనవరి । 2025



జీసీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ
మధురానగర్: గవర్నమెంట్ కాలేజియేట్ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) క్యాలెండర్‌ను బుధవారం ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ విద్యాసాగర్ ఆవిష్కరించారు.



సెపక్‌తక్రా జట్లకు స్వాగతం
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) అండర్–14 సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొనే జట్లు విజయవాడకు చేరుకుంటు న్నాయి. 24 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. –8లో ▸



ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్
బీఈ, బీటెక్ ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్ష ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. –8లో ▸

న్యూస్‌రీల్

ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు



పెనమలూరు: పోరంకి విజ్ఞాన భారత్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కార అవార్డు పొందారు. భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయ్‌పూలే పేరున ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు గుంటూరులో ఇటీవల అందజేశారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఎం.సుగుణవల్లి, జి.స్వరూప, జి.సువర్చల ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘసేవలు అందించి ప్రతిభ చూపటంతో అవార్డు పొందారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ధర్నా




పెనమలూరు: తడి, పొడి చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలల జీతాలు ఇవ్వాలని కార్మికులు పోరంకిలోని తాడిగడప మునిసిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్మికుల సంఘ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కార్మికులకు ప్రభుత్వం జీతాలు చెల్లించక పోవటం దారుణమన్నారు. మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి చూపటం సరైందికాదన్నారు. మునిసిపాలిటీలో పని చేస్తున్న ఇతర కార్మికుల సమస్యలు కూడా తక్షణం పరిష్కరించాలని లేని పక్షంలో ఫిబ్రవరి నెల నుంచి సమ్మె చేస్తామని తెలిపారు. అనంతరం కార్మికులు కమిషనర్ భవానీప్రసాద్‌ను కలిసి జీతాలు చెల్లించాలని విన్నవించారు. నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్.కాశిం, షేక్.మస్తాన్‌వలి, వై.సరళ, మధిర ఏడుకొండలు, దుర్గారావు, వెంకటరెడ్డి, పలువురు పాల్గొన్నారు.


కూచిపూడి పీఠంకు 'న్యాక్' అభినందన



కూచిపూడి(మొవ్వ): కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం విద్యార్థులను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్(న్యాక్) బృందం అభినందించినట్లు అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు వెల్లడించారు. ఐదుగురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం తెలంగాణ రాష్ట్రంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా కూచిపూడి శ్రీసిద్ధేంద్రయోగి నాట్య కళాపీఠం డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు చేస్తున్న విద్యార్థినులు ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ నేతృత్వంలో తరంగం నృత్యంతో పాటు పలు నృత్యాంశాలను ప్రదర్శించారని తెలిపారు. అలాగే కూచిపూడి నాట్య కళాపీఠంలో జరుగుతున్న వివిధ కోర్సుల నాట్య శిక్షణపై ఎంపీఏ విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. వీటిని చూసిన న్యాక్ సభ్యులు కళాపీఠాన్ని అభినందించినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలిగండ్ల నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పర్యవేక్షణలో న్యాక్ బృందం మూడు రోజులపాటు కొనసాగించిన ఈ పరిశీలనలు బుధవారంతో ముగిశాయని వెల్లడించారు.

క్రీడాకారులకు సత్కారం





చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌లో అండర్ 19 బాలికల విభాగంలో తిరుమలశెట్టి నాగచంద్రిక, అండర్–14 బాలుర విభాగంలో పుప్పాల శ్రీరామ్ గోపాల్ తమ ప్రతిభను చూపించి ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు ఎంపికయ్యారు. వీరిని బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్ సత్కరించారు.

గోడు పట్టదు.. గోస తీరదు!

ఎయిర్‌పోర్ట్ నిర్వాసితులను పట్టించుకోని సర్కార్

- విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారి విషయంలో నిర్లక్ష్యం
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఇళ్ల నిర్మాణానికి కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా పట్టించుకోని వైనం
- అద్దె బకాయిలు కూడా ఇవ్వడం లేదని నిర్వాసితుల ఆవేదన



పిచ్చి మొక్కలు, ముళ్ల కంచెలతో నిండిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ స్థలం

గన్నవరం: 'విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ స్థలంలో మౌలిక సదుపాయలు కల్పించి, గృహ నిర్మాణాలు చేసుకునేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తాం' అంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేశారు. కూటమి పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ స్థలంలో ఎటువంటి సదుపాయాలు కల్పించలేదు. కనీసం గృహ నిర్మాణాలకు నిధులు, అద్దె బకాయిలు కూడా విడుదల చేయకపోవడంతో నిర్వాసితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిదేళ్లుగా ఎదురుచూపులు..

విమానాశ్రయ విస్తరణ కోసం 2016లో దావాజిగూడెం, అల్లాపురం, బుద్ధవరం గ్రామాల్లో 423 కుటుంబాలకు చెందిన ఇళ్లు, స్థలాలను సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గృహ నిర్మాణాలు చేపట్టేందుకు 51 ఎకరాలను సేకరించి మెరక చేసిన అప్పటి టీడీపీ ప్రభుత్వం.. ప్లాట్లు మాత్రం కేటాయించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వాసితులకు లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయించింది. స్టాంప్ డ్యూటీ మినహాయించి ఉచితంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులను పంపిణీ చేసింది. నిర్వాసితులు గృహ నిర్మాణాలు చేసుకునేందుకు రెండు విడతలుగా రూ. 9 లక్షలు చొప్పున ప్రభుత్వ సాయంతో సహా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనకు రూ. 80.48 కోట్లు నిధులు కేటాయించేందుకు అంగీకరించింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో నిధులు మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో అడుగు ముందుకు పడకపోవడంతో నిర్వాసితుల్లో ఆందోళన మొదలైంది.

పాలకులు పట్టించుకోవాలి..

ఈ ప్రాంత అభివృద్ధిని కాంక్షిస్తూ విమానాశ్రయ విస్తరణ కోసం తమకు వారసత్వంగా వచ్చిన ఇళ్లు, స్థలాలను ప్రభుత్వం అడిగిన వెంటనే ఇచ్చేందుకు ముందుకు వచ్చాం. ప్రత్యామ్నాయంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గృహ నిర్మాణాలు చేసి ప్రభుత్వం న్యాయం చేస్తామని చెప్పింది. కానీ ఇంత వరకు గృహ నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

– టి. ఏసురత్నం, ఎస్సీ కాలనీ, దావాజిగూడెం

అద్దె బకాయిలు కూడా లేవు

విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల గోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. మైక్రో కెనాల్ నిర్మాణంలో మా ఇంటిని తొలగించడంతో గత ఆరేళ్లుగా కుటుంబంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రభుత్వం ఏటా ఇస్తామని చెప్పిన అద్దెను కూడా చెల్లించడం లేదు. నెలల తరబడి అద్దె బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– ఎస్.కోటేశ్వరరావు, దావాజిగూడెం

రూ. లక్షల్లో అద్దె బకాయిలు..

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఈ నిధులతో రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలను కల్పించాలని వేడుకుంటున్నారు. గృహ నిర్మాణాలకు తొలివిడత సాయం కూడా చెల్లిస్తే గృహ నిర్మాణాలు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులను పలు మార్లు కలిసి విన్నవించుకున్నట్లు తెలుపుతున్నారు. నిర్వాసితుల్లో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఉన్న దృష్ట్యా ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించాలని కోరుకుంటున్నారు. ఏడేళ్ల క్రితం ఎయిర్‌పోర్ట్ అవుట్ డ్రెయిన్ కోసం దావాజిగూడెం ఎస్సీ కాలనీలో 54 కుటుంబాలకు చెందిన గృహాలను ఖాళీ చేయించారు. వీరికి ఏడాదికి రూ. 50 వేలు చొప్పున ప్రభుత్వం అద్దె చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుంది. ఇవి కూడా సక్రమంగా చెల్లించకపోవడం కారణంగా ఒక్కొక్క కుటుంబానికి రూ. లక్షల్లో ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది.

వక్ఫ్ భూములకు మోక్షం!

- చాలా కాలానికి ఏక్‌సాల్ లీజ్ వేలానికి చర్యలు
- కొన్నేళ్లుగా ఓ వ్యక్తి చేతుల్లో వక్ఫ్ భూములు
- ఏళ్ల తరబడి లీజ్ సొమ్ము చెల్లించని వైనం
- సబ్‌లీజుతో సాగు చేస్తున్న టీడీపీ నేతలు



పెదపులిపాక గ్రామంలో వక్ఫ్ భూములు

పెనమలూరు: కోట్ల రూపాయల విలువ చేసే వక్ఫ్ భూములకు ఎట్టకేలకు ఏక్ సాల్ (ఒక సంవత్సరం సాగుకు) లీజ్ వేలం నిర్వహించడానికి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా వక్ఫ్ భూములు ఓ బడా వ్యక్తి చేతుల్లో ఉన్నాయి. అతను లీజు సొమ్ము చెల్లించడంలేదన్న ఆరోపణలు వచ్చాయి. పైగా వక్ఫ్ భూముల్లో సంక్రాంతి పండుగకు కూటమి నేతలు కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. దీనిపై 'సాక్షి'లో కథనం రావటంతో అధికార యంత్రాంగం స్పందించింది.

రూ.400 కోట్ల విలువైన భూమి

పెనమలూరు మండలం తాడిగడపలో ఆర్‌ఎస్ నంబర్లు 79,173లలో 30.04 ఎకరాలు, పెదపులిపాక గ్రామంలో ఆర్‌ఎస్ నంబర్ 87లో 12.82 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. ఈ భూములకు బహిరంగ మార్కెట్‌లో రూ.400 కోట్లకు పైగా ధర పలుకుతోంది. చాలా కాలంగా ఈ వక్ఫ్ భూములు బడా వ్యక్తి చేతుల్లో ఉన్నాయి. దీంతో ఏక్ సాల్ లీజు వేలం నిర్వహించలేదు. ఈ భూమిని బడా వ్యక్తి వద్ద నుంచి టీడీపీ నేతలు సబ్‌లీజు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. లీజు సొమ్ము కొండపల్లి ఖాజీకి లేదా వక్ఫ్ బోర్డుకు చెల్లించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. లీజుదారుడు, ఖాజీ, వక్ఫ్ అధికారులు కుమ్మక్కై వక్ఫ్ భూముల ఆదాయంతో పాటు ఆ భూములపై కన్నేశారని ముస్లిం మైనారిటీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. అయినా ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించలేదు.

ఈ నెల 31న లీజు వేలం

ఈ నెల 31వ తేదీన 42.86 ఎకరాల వక్ఫ్ భూములకు లీజు నిర్వహించడానికి తహసీల్దార్ ది ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్‌కు నోటీసు ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో 31వ తేదీ ఉదయం 11 గంటలకు ముతావలి, తాడిగడప మునిసిపల్ కమిషనర్, రెవెన్యూ, వక్ఫ్ అధికారుల సమక్షంలో ఏక్ సాల్ లీజు వేలం జరుగుతుంది.

ఏక్ సాల్ లీజు వేలం జరుగుతుందా?

అత్యంత విలువైన వక్ఫ్ భూముల ఏక్ సాల్ లీజు సక్రమంగా నిర్వహిస్తారా లేదా అనే విషయం స్థానికుల్లో చర్చ జరుగుతోంది. పంటలు సమృద్ధిగా పండే ఈ భూములపై బడా వ్యక్తులు కన్నేయటంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏక్ సాల్ లీజు సక్రమంగా జరిగితే మంచి ఆదాయం చేకూరే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లుగా ఏక్‌సాల్ లీజు జరగక పోవటంతో అందరి దృష్టి వక్ఫ్ భూములపైనే ఉంది.

కోడి పందేల బరితో..

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించటానికి వక్ఫ్ భూమిలో బరి సిద్ధం చేశారు. టీడీపీ నేతలు సబ్ లీజు తీసుకోవటంతో చట్ట విరుద్ధంగా ఈ చర్యలకు దిగారు. 'వక్ఫ్ భూముల్లో బరితెగింపు' శీర్షికన ఈ నెల 12న 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగం స్పందించింది. సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఈ వ్యవహారంపై పీజీఆర్‌ఎస్ (మీ కోసం)లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ కూడా లీజు వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏక్ సాల్ లీజు నిర్వహించాలని పెనమలూరు తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా భద్రత విషయంలో రాజీ పడం

- హోం మంత్రి వంగలపూడి అనిత
- సురక్షా కమిటీలు ప్రారంభం



సురక్షా కమిటీలను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, డీజీపీ ద్వారకాతిరుమలరావు తదితరులు

విజయవాడస్పోర్ట్స్: ప్రజలకు భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజా భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే సురక్షా కమిటీల ద్వారా నేరాలను కట్టడి చేసేందుకు పోలీస్ శాఖ సరికొత్త ప్రయత్నం చేస్తోందని వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సురక్షా కమిటీలను విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాలులో హోం మంత్రి అనిత బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సురక్షా కమిటీ కో ఆర్డినేటర్‌గా కేవీ నరసయ్య నియమితులయ్యారు.

దాతల ప్రోత్సాహం అభినందనీయం..

డీజీపీ ద్వారకాతిరుమలరావు మాట్లాడుతూ నేరాల కట్టడికి ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. విజయవాడ నగరంలోని బ్లాక్‌స్పాట్‌లలో ఏర్పాటు చేసేందుకు 1,150 సీసీ కెమెరాలను వితరణగా ఇచ్చిన దాతలను ఆయన అభినందించారు.

నూతన భవనాలు నిర్మించండి..

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ విజయవాడ నగరంలోని పోలీస్ క్వార్టర్స్, పోలీస్ స్టేషన్‌ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. నూతన భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని హోంమంత్రి అనితను ఆయన కోరారు. అనంతరం 1000 సీసీ కెమెరాలతో పాటు, ఈగల్ వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమా, సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరాంరాజగోపాల్‌తాతయ్య, కొలికపూడి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు, డీసీపీలు గౌతమి సాలి, మహేశ్వరరాజు, కృష్ణమూర్తినాయుడు, తిరుమలేశ్వర రెడ్డి, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.

'కొలికపూడి' చెప్పేవన్నీ అబద్ధాలే



భూక్యా చంటిని పరామర్శిస్తున్న మేరుగ నాగార్జున, అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

తిరువూరు: టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే ఆడుతున్నారని, గిరిజన మహిళపై దాడిచేసి అది తప్పుకాదని బుకాయిస్తున్నారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం గోపాలపురంలో ఈనెల 11న ఎమ్మెల్యే దాడిలో తీవ్రంగా గాయపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వార్డు సభ్యురాలు, గిరిజన మహిళ అయిన భూక్యా చంటిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో కలిసి బుధవారం పరామర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ తిరువూరులో ఎమ్మెల్యే అరాచకంగా వ్యవహరిస్తున్నారని.. కొలికపూడికి మహిళలంటే గౌరవంలేదన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలపై దాడులకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం గర్హనీయమన్నారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. పోలీసులు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి.

ఎమ్మెల్యేపై చర్యలెందుకు తీసుకోవట్లేదు?

ఇక ఎమ్మెల్యే కొలికపూడిపై టీడీపీ అధిష్టానం ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవట్లేదని దేవినేని అవినాష్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేతో పాటు ఈ దాడిలో పాల్గొన్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులే కొలికపూడిపై ఫిర్యాదు చేస్తున్నారంటే ఆయన అరాచకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందన్నారు. ఇక ఎమ్మెల్యే తన స్వీయ రక్షణ కోసమే గిరిజన మహిళ కుటుంబంపై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆరోపించారు. మహిళలకు అండగా ఉంటామని చట్టసభల్లో మాట్లాడే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరువూరు ఎమ్మెల్యే చర్యలకు ఏం సమాధానం చెబుతారని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ప్రశ్నించారు.

అంపశయ్యపై ఆయుష్!

ఆయుర్వేద ఆస్పత్రిపై సర్కారు చిన్నచూపు

- రాష్ట్రంలోని ఏకైక ఆయుర్వేద కళాశాలలో సౌకర్యాల లేమి
- అరకొరగానే సిబ్బంది
- మందులు కూడా గత ప్రభుత్వంలో ఇచ్చినవే
- ఈ ఏడాది అడ్మిషన్లు అనుమానమే అంటున్న నిపుణులు



విజయవాడ బందర్ రోడ్డులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వందేళ్ల చరిత్ర కలిగిన విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల సౌకర్యాల లేమితో కునారిల్లుతోంది. రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిస్తేజంగా మారింది. నర్సింగ్ పారామెడికల్ సిబ్బందిలో 63 శాతం ఖాళీలు ఉన్నట్లు నిర్ధారించగా, వైద్యులు సైతం 20 శాతం ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. వైద్యులు ఉంటే కాంపౌండర్ ఉండరు, కాంపౌండర్ ఉంటే వైద్యులు ఉండని దీన స్థితి నెలకొంది. మందులు సైతం గత ప్రభుత్వంలో సరఫరా చేసినవేనని, ప్రస్తుత ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదని చెబుతున్నారు. ఫలితంగా రోగులు సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోతోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నా..

భారతీయ వైద్యమైన ఆయుర్వేదాన్ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్నాటకల్లో ఆయుర్వేద కళాశాల, ఆస్పత్రుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన సిబ్బంది నియమిస్తుండగా, ఇక్కడ మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు. వైద్యుల పోస్టులు 20 శాతం ఖాళీలు ఉండగా, నర్సులు, పారామెడికల్, నాల్గో తరగతి ఉద్యోగులు 63 శాతం ఖాళీలు ఉన్నట్లు లెక్కతేల్చారు. ఈ స్థాయి ఖాళీ పోస్టులుంటే రోగులకు సేవలు ఎలా అందుతాయో పాలకులకే తెలియాలి.

సేవలు డీలా..

ఒకప్పుడు ఆయుర్వేద కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో నిత్యం 350 నుంచి 400 మంది వరకూ రోగులు వచ్చేవారు. కానీ నేడు రోగుల సంఖ్య సగానికి తగ్గిపోయింది. అందుకు అరకొర సౌకర్యాలే కారణంగా చెబుతున్నారు. సిబ్బంది లేక పంచకర్మ విభాగంలో అరకొర సేవలు అందుతున్నాయి.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న వైద్యుడు

మందులు కూడా గత ప్రభుత్వంలో సరఫరా చేసినవే. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మందులు సరఫరా ఇప్పటి వరకూ జరగలేదని చెబుతున్నారు. దీంతో అందుబాటులో లేని మందులకు బయటకు రాస్తున్నారు. అంతేకాదు వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం పూర్తిస్థాయిలో అందుబాటులో లేక పోవడంతో బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది.

అడ్మిషన్‌లు అనుమానమే..

ఆయుర్వేద వైద్య కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లకు అనుమతి లభించడం అనుమానమేనని నిపుణులు అంటున్నారు. వైద్య విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కొరత కారణంగా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్(సీసీఐఎం) పలు అంశాలతో కూడిన నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. ఆయా అంశాలను సరిదిద్దితేనే అడ్మిషన్లకు అనుమతి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొంది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎప్పటికి పరిష్కరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

సౌకర్యాలు కల్పించాలి..



రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలను నిర్లక్ష్యం చేయడం సరి కాదు. రోగులకు అవసరమైన మందులను సరఫరా చేయడంతో పాటు, కొరత ఉన్న సిబ్బందిని నియమించాలి. కేంద్రం ఆయుర్వేదాన్ని ప్రోత్సహించాలంటుంటే, రాష్ట్రంలోనేమో ఆయుర్వేదాన్ని నిర్లక్ష్యం చేయడం సరి కాదు. రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– డాక్టర్ మెహబూబ్ షేక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం

ఉన్నతాధికారులతో చర్చించాం

ఆయుర్వేద ఆస్పత్రి, కళాశాలలో సిబ్బంది కొరత ఉంది. ఈ విషయమై ఆయుష్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించాం. ఇటీవల కొందరు వైద్యులను నియమించారు. ఉన్నవారికి ఉద్యోగోన్నతులు ఇచ్చారు. ఈ ఏడాది యూజీ సీట్లు అడ్మిషన్లకు అనుమతి లభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ సాయిసుధాకర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, విజయవాడ

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు బాధ్యుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాలకు బాధ్యులను నియమించారు. ఎన్టీఆర్ జిల్లా, నందిగామ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మూలే నాగిరెడ్డి పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.

- విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గేర హనోక్‌ను రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడిగా నియమించారు.
- కృష్ణా జిల్లా, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన దోవారి పూర్ణ సాగర్‌ను పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన పి. జాకబ్ సుధాకర్ ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు.



క్లుప్తంగా

కృష్ణా యూనివర్సిటీ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక



మైలవరం: దక్షిణ భారత క్రికెట్ పోటీలకు కృష్ణా యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. తమ కళాశాలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళ క్రికెట్ సెలక్షన్స్‌లో వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారిణులను వర్సిటీ జట్టుకు ఎంపిక చేశామన్నారు. డాక్టర్ ఎల్‌హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వర్ధిని, నలంద డిగ్రీ కళాశాల నుంచి లేఖన, మాధవి, శ్రీలక్ష్మి, గౌతమి, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎస్తేరు రాణి, సిద్ధార్థ మహిళా కళాశాల నుంచి చంద్రజ, లేఖన, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల నుంచి సమీర, శివ లక్ష్మి, వెన్నెల, మహాలక్ష్మి, ఎల్‌హెచ్ ప్రభుత్వ కళాశాల నుంచి లోహిత, కేబీఎన్ కళాశాల నుంచి సత్య జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 23 నుంచి కర్ణాటకలోని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్‌లో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ జట్టుకు మేనేజర్‌గా తమ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి, టీమ్ క్యాప్టెన్‌గా కె.వై.ఎం.వి.వర్ధిని వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు.

పుస్తకాలు లేకుండానే పరీక్షలు

- రెగ్యులర్‌తో పాటు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు
- షెడ్యూల్ విడుదలపై సర్వత్రా విస్మయం
- ఇప్పటి వరకూ పుస్తకాలు అందలేదు.. తరగతులు జరగలేదు
- ప్రభుత్వ తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆగ్రహం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఏడాదంతా తరగతులకు హాజరై, ఇంటి వద్ద పుస్తకాలు ముందేసుకుని చదివిన పరీక్షలు రాయటం పరిపాటి. పుస్తకాలు అందలేదు. తరగతులు జరిగిందీ లేదు. అయినా ఈ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ తీరుపై విద్యార్థులు మండి పడుతున్నారు. తమ పిల్లల జీవితాలతో ఆటలాడొద్దంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫీజులు చెల్లించి పది రోజులు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫీజులు చెల్లించిన విద్యార్థులకు రెగ్యులర్ విద్యార్థుల షెడ్యూల్‌లోనే పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజులు చెల్లించి పది రోజులు కాలేదు. పుస్తకాలు చేతికి రాలేదు. తరగతులు ప్రారంభమే కాలేదు. అప్పుడే పరీక్షలంటూ ఉత్తర్వులు ఏమిటంటూ ఆందోళన చెందుతున్నారు.

ఇటీవలే ముగిసిన అడ్మిషన్ ప్రక్రియ

పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు గత ఏడాది జూలై 31న ఏపీ సార్వత్రిక విద్యాపీఠం నోటిఫికేషన్ జారీ చేసింది. అడ్మిషన్లకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. అపరాధ రుసుం లేకుండా నవంబర్ మాసాంతం వరకూ దరఖాస్తులు స్వీకరించింది. డిసెంబర్ 23 నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేసుకున్న వారి నుంచి పరీక్షల ఫీజు స్వీకరించింది. ఎన్టీఆర్ జిల్లా నుంచి పదో తరగతికి 1,743 మంది, ఇంటర్మీడియెట్ కోర్సులకు 3,033 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

అతీగతి లేని మెటీరియల్

సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులు ఆ సంస్థ నుంచి ఫీజు చెల్లించిన ప్రతి ఒక్కరికీ మెటీరియల్‌ను అందిస్తుంది. వారికి కేటాయించిన సబ్జెక్టులతో పాటుగా వారు ఎంచుకున్న సబ్జెక్టుల పుస్తకాలను అందజేస్తుంది. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి వరకూ పుస్తకాలు అంద లేదు. తరగతులను నిర్వహించే కేంద్రాల నిర్వాహకులకు పుస్తకాలు తీసుకెళ్లాలని జిల్లా అధికారులు సూచించినట్లు తెలిసింది. అయితే పోస్టల్ ఖర్చులు చెల్లించిన తరువాత నేరుగా అందించాల్సిన పుస్తకాలను తాము తీసుకోవటం ఏమిటంటూ ఇప్పటి వరకూ విద్యార్థులకు పుస్తకాలు చేర్చే చర్యలను ఎవరూ చేపట్టలేదు.

తరగతుల ఊసే లేదు

విద్యాపీఠం ద్వారా ఆయా కోర్సులు చదివే విద్యార్థులకు కనీసం 30 తరగతులను నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు నిబంధనలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకూ కొన్ని కేంద్రాల్లో తరగతులే ప్రారంభం కాలేదు. సెలవు రోజులతో పాటుగా ఎంపిక చేసిన రోజుల్లో ఈ తరగతులను నిర్వహిస్తారు. ఇప్పటి నుంచి తరగతులు నిర్వహించినా 30 తరగతులు జరిగే అవకాశం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు చెబుతున్నారు. మార్చి మొదటి తేదీ నుంచి ఇంటర్మీడియెట్, అదే నెల 17 నుంచి పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. అదే షెడ్యూల్‌లో ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం ఈ నెల 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం కేవలం నెల రోజుల్లో ఇంటర్మీడియెట్, 50 రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. ఈ ప్రకారం పరీక్షలు జరిగితే సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పరీక్షలు రాసే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారి తల్లిదండ్రులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసస్తున్నారు.

రెగ్యులర్ షెడ్యూల్‌లోనే పరీక్షలు

రాష్ట్రంలో జరిగే రెగ్యులర్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల షెడ్యూల్‌లోనూ ఓపెన్ స్కూల్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లోనే ఓపెన్ స్కూల్ పరీక్షలు రాసే విద్యార్థులకు గదులను కేటాయింస్తారు. అక్కడే పరీక్షలు కొనసాగుతాయి. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రక్రారం మేం చర్యలు చేపడతాం.

– వెంకటప్పయ్య, ఏపీ ఓపెన్‌స్కూల్, జిల్లా సంచాలకుడు

పుస్తకాలే అందలేదు



ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతికి ఇటీవలే ఫీజు చెల్లించా. ఇప్పటి వరకూ పుస్తకాలు అందలేదు. పుస్తకాలు అందకుండా, తరగతులు జరగకుండా పరీక్షల తేదీలను ప్రకటిస్తున్నారు. మరో 50 రోజుల్లో పరీక్షలని చెబుతున్నారు. మాకు ఏమి అర్థం కావటం లేదు. మే నెలలో పరీక్షలు నిర్వహిస్తే మాకు మేలు జరగుతుంది. ఇప్పటి వరకూ ఏమి పట్టించుకోకుండా ఒక్కసారిగా త్వరలో పరీక్షలంటూ హడావుడి చేయటం సరికాదు.

– షేక్ జాన్‌బాషా, పదో తరగతి విద్యార్థి, విజయవాడ

పరీక్షలకు సమయం ఇవ్వాలి



ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసే విద్యార్థులకు తగినంత సమయం ఇవ్వాలి. తరగతులు అన్నీ జరిగిన తరువాత మాత్రమే పరీక్షలు నిర్వహించాలి. ఇప్పటి వరకూ అంతంత మాత్రంగానే తరగతులు జరుగుతున్నాయి. తరగతులు పూర్తి స్థాయిలో జరిగిన తరువాత మాత్రమే పరీక్షలను నిర్వహించాలి. లేదంటే మా లాంటి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. మే నెలలో పరీక్షలు నిర్వహిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు.

– కె.షణ్ముఖ్, ఇంటర్ విద్యార్థి, విజయవాడ

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు పొందుగల సర్పంచ్ కోటమ్మకు ఆహ్వానం



గుగులోతు కోటమ్మ

మైలవరం: మండలంలోని పొందుగల గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు అతిథిగా హాజరుకావాలని గ్రామ సర్పంచ్ గుగులోతు కోటమ్మకు కేంద్ర ప్రభుత్వం నుంచి బుధవారం ప్రత్యేక ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయడంతో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన దేశంలోని 1000 పంచాయతీలను కేంద్రం గుర్తించింది. ఈ వెయ్యి పంచాయతీల్లో పొందుగల ఒకటి కావడం ఈ ప్రాంతానికే గర్వకారణం. ఈ నేపథ్యంలో గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని సర్పంచ్‌కు ఆహ్వానం అందిందని పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ తెలిపారు. గ్రామంలోని ఆరువేల మంది జనాభాలో 1200 మంది గిరిజనులు ఉన్నారు. కోటమ్మ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, డొంక రోడ్లు, కాలువలు, చెరువు కట్టలు బలోపేతం, శ్మశానవాటికలు, విద్యుత్ వ్యవస్థ, వీధి దీపాలు తదితర విభాగాల్లో అభివృద్ధి జరిగింది. టాటా ట్రస్టు సౌజన్యంతో ఐటీటీ సిస్టమ్‌ను రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేశారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి రక్షిత తాగునీరు అందిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుతున్నారు. రక్షిత మంచినీటి సరఫరాలో ఉత్తమ పంచాయతీ అవార్డును సొంతం చేసుకుంది. పొందుగల పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్ కోటమ్మ కృషి అభినందనీయమని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

నగరానికి చేరుకున్న సెపక్‌తక్రా జట్లు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) అండర్-14 సెపక్‌తక్రా జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే జట్లు బుధవారం విజయవాడకు చేరుకున్నాయి. నగరంలోని పటమట బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. జార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు జట్లు బుధవారం నగరానికి చేరుకున్నాయి. ఈ జట్లకు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ పోటీల్లో మొత్తం 12 రాష్ట్రాల జట్లు పాల్గొంటున్నాయని, నాలుగు కోర్టుల్లో మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయని పోటీల నిర్వహణ కార్యదర్శి సింహాద్రి రమేష్, ఎస్‌జీఎఫ్ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి

పెనమలూరు: నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వృద్ధురాలు అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఎస్ఐ రాజేష్ కథనం మేరకు.. పెనమలూరు పల్లిపేట రామాలయం ప్రాంతానికి చెందిన పామర్తి విజయలక్ష్మి ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కుమారుడు సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆమె ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. విజయవాడ – గుణదల రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం విజయలక్ష్మి తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని జీఆర్‌పీ పోలీసులు గుర్తించి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి మంగళవారం మృతి చెందింది. కదులుతున్న రైల్లో నుంచి కింద పడిపోయి గాయపడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండలంలోని పోరంకిలో విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోరంకికి చెందిన 21ఏళ్ల విద్యార్థిని బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. సోమవారం కాలేజీకివెళ్లిన ఆమెతిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

రంగుల కలగా విజన్ 2047 డాక్యుమెంట్



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రైవేటు రంగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు ఆచరణ సాధ్యం కాదని, ఇప్పటి వరకూ ప్రపంచంలో ఎక్కడా ఇది సాకారం కాలేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. గవర్నర్‌పేట బాలోత్సవ భవన్‌లో సీపీఎం 27వ మహాసభల సందర్భంగా బుధవారం 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి – ప్రత్యామ్నాయ విధానాలు' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు జవాబుదారి తనం, స్పష్టమైన ప్రణాళికలు, నిర్దిష్టమైన కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. దేశానికి చెందిన పెట్టుబడిదారులతో సీఎం చంద్రబాబు దావోస్‌లో ఒప్పందాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే సంతోషమేనని, గతంలో ఎన్నోసార్లు చేసుకున్న ఒప్పందాలు ఫలప్రదమైన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు. 2029 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను విస్మరించి 2047 రంగుల కలలను సృష్టించడం ప్రజలను మభ్యపెట్టడమేనని స్పష్టం చేశారు. ప్రజల సంపద పెరగాలంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, సామాజిక రంగాల్లో విద్య, వైద్యం ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు చౌకగా లేబర్‌ను అందించేందుకు పిల్లలని కనాలని సీఎం చంద్రబాబు చెబుతున్నారని, అది బాధ్యత లేని సలహా అని విమర్శించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాదని, మానవ అభివృద్ధి, సమ్మిళిత అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి అని వివరించారు. ఈ సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయం ప్రొఫెసర్ అంజిరెడ్డి, సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు, రైతు సంఘం నాయకుడు భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యఘర్ ప్రత్యేక అవగాహన ర్యాలీలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణకు మేలుచేసే పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు గురువారం ప్రత్యేక ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్‌పై వెండర్లు, అధికారులు, సిబ్బందితో కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి ఏడో తేదీలోగా మరో 1,100 యూనిట్ల గ్రౌండింగ్‌కు సిద్ధం కావాలని ఆదేశించారు. పథకంపై గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా అవగాహన ర్యాలీల నిర్వహణకు ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ర్యాలీల్లో సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. కాలేజీ, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మానవహారాలతో పథకంపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బందికి పోస్టర్లు, బ్యానర్లు అందజేయాలని ఏపీసీపీడీసీఎల్ అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద ఆదర్శ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన పరిటాల, వెల్వడం, బూదవాడ, ఎస్ఎంపేట, కంభంపాడులో 100 శాతం కనెక్షన్ల ఏర్పాటుకు అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాగు ఖర్చులకు అనుగుణంగా రుణపరిమితి

డీఎల్‌టీసీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వివిధ పంటల సాగుకు అయ్యే ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంట రుణాల మంజూరుకు పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్-ఎన్టీఆర్ జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ వర్చువల్‌గా హాజరయ్యారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, ప్రగతిశీల రైతులు, బ్యాంకర్లు తదితరులు హాజరై 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై ప్రతిపాదనల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ ద్వారా 2025-26కు గాను వరికి రుణ పరిమితి రూ.46 వేలు, మిరప (డ్రై)కు రూ.1.10 లక్షలు, మిరప (ఇరిగేటెడ్)కు రూ.1.15లక్షలు, మామిడికి రూ.42,500, ఆయిల్‌పామ్‌కు రూ.75 వేలు, పట్టు పురుగుల పెంపకానికి రూ.60 వేలుగా రుణపరిమితిని ప్రతిపాదించారని వివరించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)కి అదనంగా 30 శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశముందన్నారు. ఈ సమావేశంలో కేడీసీసీబీ లిమిటెడ్ సీఈఓ ఎ.శ్యామ్ మనోహర్, జీఎం ఎ.రంగబాబు, అసిస్టెంట్ ఎల్‌డీఎం ఎం.రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ప్రగతిశీల రైతులు కె.నరసింహారావు, పి.నాగేశ్వరరావు, ఎ.అజయ్ కుమార్, పి.ఎస్.ఆర్.ప్రసాద్, ఎం.రాజశేఖర్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐఓబీ, యూకో తదితర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన జేఈఈ మెయిన్స్



కానూరు ఐకాన్ డిజిటల్ వద్దకు సమయం ముగిశాక వచ్చి పరీక్ష రాయలేకపోయిన విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బీఈ, బీటెక్ ప్రవేశాల కోసం దేశ వ్యాపితంగా నిర్వహించే జేఈఈ (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జిమినేషన్) మెయిన్స్ పరీక్ష ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం ప్రశాతంగా ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 11 కేంద్రాల్లో ఈ పరీక్ష కొనసాగింది. కంప్యూటర్ బేసిడ్‌గా ఈ పరీక్షను నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఈ పరీక్ష రెండు షిఫ్టులుగా కొనసాగింది. పరీక్షకు గంట ముందుగా విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు. జిల్లాలోని ఎస్ఆర్కే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎనికేపాడు), శైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ (కానూరు), ఐకాన్ డిజిటల్ జోన్ (కంద్రిక), పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ వన్‌టౌన్), లైఫ్ బ్రిడ్జి ఇన్ఫోటెక్నాలజీస్ (గొల్లపూడి), ఎస్‌వీటీ ఇన్ఫోటెక్ (గవర్నరుపేట), ఐకాన్ డిజిటల్ జోన్ (కానూరు), లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (మైలవరం), సాయి లక్ష్మి కంప్యూటర్స్ (గొల్లపూడి), శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫోసొల్యూషన్స్ (ఎనికేపాడు), ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నున్న) కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. అన్ని పరీక్ష కేంద్రాలకు తొలి రోజు 6,500 మంది విద్యార్థులను కేటాయించారు.

27 నుంచి ఆహ్వాన నాటకోత్సవాలు



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు ఎనిమిదో ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహిస్తునట్లు తపస్వి కల్చరల్ ఆర్ట్స్ సంస్థ అధ్యక్షుడు వేములు హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 27వ తేదీ సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నాటకోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. తొలి రోజు గురి తప్పిన వేట, మూల్యం నాటకాల ప్రదర్శన, అంతర్జాతీయ గాయకుడు అరుణా సుబ్బారావుకు సత్కార కార్యక్రమం, 28వ తేదీ మహా ప్రస్థానం, ఓ కాశీవాసా రావయ్య నాటకాల ప్రదర్శన, డాక్టర్ పాటూరి సుబ్రహ్మణ్యంనకు ఆత్మీయ సత్కారం, 29వ తేదీన ఇది అతకని సంతకం, పేగు రాసిన శాసనం నాటకాల ప్రదర్శన, నృత్య కళాకారుడు కొమరిపాటి ఏసు వెంకట ప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం జరుగుతాయని వివరించారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్మోహనరావు మాట్లాడుతూ సినీ దిగ్గజం ఎన్టీ రామారావును స్మరించుకుంటూ ఎనిమిదేళ్లుగా నాటకోత్స వాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ సమావేశంలో తపస్వి కల్చరల్ ఆర్ట్స్ బాధ్యులు శ్రీనివాసరావు, మల్లేశ్వర పట్నాయక్, ప్రభాకరరావు పాల్గొన్నారు. నాటకోత్సవాల బ్రోచర్లను గుప్తాతోపాటు అతిథులు ఆవిష్కరించారు.

దుర్గగుడి ప్రధాన అర్చకుడు బద్రీనాథ్‌బాబు ఆకస్మిక మృతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రధాన అర్చకుడు లింగంభొట్ల వెంకట సుబ్రహ్మణ్య బద్రీనాథ్‌బాబు(64) మృతి చెందారు. బుధవారం ఉదయం ఆలయానికి బయలుదేరే క్రమంలో స్నానం చేసి బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తూ ఒక్క సారిగా ఆయన కుప్పకూలి ప్రాణం విడిచారు. బద్రీనాథ్‌బాబుకు భార్య లక్ష్మీకుమారి, కుమారులు భవాని, శరత్, కుమార్తె సునీత ఉన్నారు. వంశపారంపర్య అర్చకుడిగా 40 ఏళ్ల నుంచి అమ్మవారి సేవలో తరిస్తున్న బద్రీనాథ్‌బాబు దసరా ఉత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకారాలు చేయడంలో దిట్ట. గడిచిన 20 ఏళ్లకు పైగా అమ్మవారిని దసరా ఉత్సవాల్లో విశేషంగా అలంకరిస్తున్నారు. విద్యాధరపురంలోని అరవింద్ వీధిలో ఉన్న స్వగృహం వద్ద బద్రీనాథ్‌బాబు మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. దుర్గగుడి పూర్వ ఈఓ కె.ఎస్.రామరావు, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు బద్రీనాథ్‌బాబు మృతదేహానికి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవదాయ శాఖ ముఖ్య అధికారులు ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెరువులో మృతదేహం లభ్యం

ఉయ్యూరు: పట్టణంలోని శ్మశానవాటిక సమీపంలోని చెరువులో బుధవారం మృతదేహం లభ్యమైంది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి మృతుడు పమిడిముక్కల మండలం తాడంకి గ్రామానికి చెందిన చలపాటి ప్రకాష్‌బాబు (45)గా గుర్తించారు. చిత్తు కాగితాలు ఏరుతూ, రిక్షా కార్మికుడిగా జీవనం సాగిస్తున్నట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.